

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

# శ్రీ సాయి లీలామృతము



## అధ్యాయము - 14

## జన్మాంతర జ్ఞానం

శ్రీసాయి వంటి సద్గురువు లభించినా ఆయన కృపతో ఒకటి రెండు జన్మలలో తరించగల ధీరులెంతో అరుదు. కారణం భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పినట్లు, నిజంగా ఆత్మజ్ఞానం ('సిద్ధి') కోసం యత్నించేవారు కొన్నివేల మందికి ఏ ఒక్కరో వుంటారు. రాగద్వేషాలలో చిక్కి మనం అడుగడుగుకూ 'పరమపద సోపానపటం'లోని పావులలాగ సద్గురువును గూడ తగురీతిన సేవించలేము. మామిడిపూత, పిందెలులాగ రాలిపోతుంటాము. ఒకసారి ఆయన,"ఎవరు నా శిష్యులనేది? అలాంటివాడు నాకొక్కడూ కన్పించలేదు" అన్నారు. కారణం భగవద్గీతలో చెప్పినట్లు నిజంగా ఆత్మజ్ఞానం కోసం యత్నించేవారు కొన్నివేల మందిలో యే ఒక్కరో వుంటారు. మిగిలిన అందరమూ బాబా అంతటి సద్గురువు దొరికినా అనేక జన్మలెత్తే వాళ్ళమే కనుక ఆయన రక్షణ మనకు ప్రతిజన్మలోనూ అవసరమే. అది అందించగల్గడమే ఆయన విశిష్టత. శ్రీమతి తార్కాడ్‌తో ఒకరోజు బాబా, "ఎన్ని జన్మలలో మీతో వున్నానో! ముందు జన్మలన్నింటిలోనూ మీతో వుంటాను. మనం మళ్ళీ మళ్ళీ కలుసుకుంటాం. నాకిచ్చిన ప్రతిపైసాకూ నేను భగవంతునికి లెక్క చెప్పుకోవాలి" అన్నారు. పైసా అంటే జీవి. భగవదనుగ్రహము లేక సాయిని ఆశ్రయించ లేము. ఇలా భగవంతుడు తమకప్పగించిన ప్రతి జీవినీ తిరిగి ఆ పరమాత్మకప్పగించడానికే బాబా అవతరించినది. అందుకే ఆయన, "నేనెవరినీ మధ్యలో విడువను. చివరికంటా గమ్యం చేరుస్తాను" అన్నారు.

బాబా తమ పూర్వజన్మ వృత్తాంతాలిలా చెప్పారు. "నేనొకప్పుడు గుడ్డలు, తలపాగా, పట్టువస్త్రాలు, తివాచీలు నేసేవాణ్ణి. ఇన్ని పనులు చేసినా తిండిగూడ గడిచేదిగాదు." బాల్యంలో నేను శాలువలు నేసేవాణ్ణి. నా నేర్పరితనానికి మెచ్చి నా తండ్రి రూ. 5/- లు బహూకరించారు." "నేనొకసారి బాల్యంలో వృత్తికై అన్వేషించి భీడ్ అనే వూరిలో జరీ అంచు వస్త్రాలు నేసేపని సంపాదించాను. నా ఫకీరు (యజమాని) మంచితనం వల్ల నేనెప్పుడూ నా పనిలో విసుగొందలేదు. నలుగురి పని ఒక్కడినే చేసేవాణ్ణి. ఒకడు రోజుకు రూ. 50/- లు, మరొకడు రూ. 100/- లు, యింకొకరు రూ. 150/- లు విలువచేసేవి నేస్తే, నేను రూ 600/- లు విలువచేసే వస్త్రాలు నేశాను. యజమాని సంతోషించి ప్రేమతో యితరుల యెదుట నన్ను ప్రశంసించి, నాకు చక్కటి దుస్తులు, తలపాగా, శాలువా బహూకరించారు. నేను వాటిని వాడుకోక యితరులకిచ్చాను. భగవంతుడిచ్చేది నశించదు. మానవులిచ్చేది నిలవదు!"

ఆయనే ఒకసారి, "నేను ముందు జన్మలో కబీరును, నూలు వడికేవాడిని" అన్నారు. కబీరు సద్గురువుగా అవతరించి, యోగసాధనకు సంకేతంగానే ఆ వృత్తి చేసారు. గురుసేవను, ఆ వృత్తినీ గూడ త్రికరణశుద్ధిగా, మరెవరూ చేయలేనంతగా చేసి, గురువనుగ్రహంతో సాటిలేని పూర్ణత్వాన్ని సాధించామని సాయి భావమేమో! ఒకటి మాత్రం నిశ్చయం: ఆయన ఎన్నో జన్మల క్రిందటనే మహనీయుడుగా వున్నారు. "నేనొకప్పుడు 4వేల మందిలో వుండగా ఆ ప్రాంతంలో అంటువ్యాధి చెలరేగింది. భయపడిపోతున్న ఆ జనంతో, "నేను బ్రతికుండగా మీలో యెవ్వరినీ మరణించనివ్వను అని అభయమిచ్చి రక్షించాను" అని ఆయనే చెప్పారు. కొన్ని జన్మలలో వారు

గూడ మహనీయులను సేవించారు. "శిరిడీలో యిప్పుడు ఈ మశీదున్నచోట ఒకానొకప్పుడు 'ముజాఫర్‌షా' అనేవారుండేవారు. వారి అబ్బాయికి మైళ్ళకొద్దీ భూసంపద వుండేది. నేనాయనకు వంటచేసి పెట్టేవాణ్ణి. ఇప్పుడు ధుని వున్నచోటే వారు మరణించారు" అని ఆయనే చెప్పారు. పూర్వ జన్మలలో గూడ సాయి విస్తారంగా పర్యటించేవారని, ఆయనకు వృక్ష వైద్యంవంటి విద్యలెన్నో తెలిసినట్లు అర్థమవుతుంది. ఒకప్పుడాయన, "చిన్నతనంలో నేను జాల్నా నుండి చాలాదూరం నడిచాక దారిలో ఒక మామిడిచెట్టు కన్పించింది. దాని పిందెలన్నింటికీ పురుగులు పట్టివున్నాయి. నేను దాని బోదెకు యినుప మేకు కొట్టాను. దానితో ఆ దోషం పోయింది" అన్నారు. ఈ జన్మలో గూడా లెండీలో ఆయన ఒక రావిమొక్క, రెండు వేపమొక్కలు నాటారు. రావిమొక్క ఎంతకూ ఎదగలేదు. ఆయన నిత్యమూ దానిని స్వహస్తాలతో అటూ యిటూ వంచేవారు. తర్వాత అదెంతో ఏపుగా పెరిగింది.

ప్రతి జన్మలోనూ సాయిమాత్రం ధర్మమెప్పుడూ తప్పలేదు. అది లోకానికి విరుద్ధంగా తోచినా లెక్కచేయనూ లేదు. "ఒకప్పుడొక తోటలో రోహిల్లా ఈతకల్లు అమ్మే ఆమెను మోహించి వివాహమాడాడు. ఆమె నీతి తప్పి నడచుకున్నది. చివరకు ఆమె పాదాలు పుండ్లుపడి పురుగులుపట్టాయి. ఆమె ఎలాంటిదైనా నాకు తల్లి గనుక ఆమెకు చికిత్స చేసాను" అన్నారు బాబా. ఆమె తన పాపాలవలన రోగంతో మరణించింది. సాయి, లోకానికి వెరవకుండా తమ ధర్మం తాము నిర్వర్తించి, మాతృసేవవలన పరిశుద్ధులయ్యారు.

ఆయన అందరిపట్లా యిలాంటి ధర్మనిరతి కల్గియుండేవారు. ఒకసారి ఆయనిలా చెప్పారు : "ఈ ప్రాంతంలోని పాటిల్ తరచూ నావద్దకొచ్చేవాడు. అతనికి 12 మంది భటులుండేవారు. మరొకసారి అతనితో భేదాభిప్రాయం కల్గి అతనిపై బడ్డపుడు నేనతనికి తోడ్పడ్డాను. ఒకసారి వాళ్ళు అతనిని బలవంతంగా ఒక నగరానికి తీసుకుపోతే, నేను జోక్యం చేసుకొని అతనిని విడిపించాను" మరొకప్పుడు ఆయనిలా అన్నారు : "సోదరులిద్దరం ఒక మార్గాన పోతున్నాము. నా సోదరుడు ముందుపోయి క్రూరజంతువుల పాలైనాడు. అయిదారుగురు వచ్చి, 'నీ సోదరుడేడి?' అన్నారు. జరిగినది చెప్పి అతని శరీరంమీద వస్త్రం కప్పానని కూడా చెప్పాను. వారు నామాట నమ్మక, వారిస్తున్నా వినకుండా, నా సోదరుని కోసం వెళ్ళి ఆ జంతువుల పాలయ్యారు. తర్వాతా స్థూలకాయురాలైన ఒక స్త్రీ గూడ నా సోదరుని వెదుకబోయింది. ఆమెకూ అదేగతి పట్టింది. ఆమె శవంమీద గుడ్డకప్పి ముందుకు సాగిపోయాను." జ్ఞానం కావలసినవారు ముందుకు పోతారుగాని, 'ముందుకు పోవాలి!' అని ఆరాటపడేవారు సిద్ధులకోసం ప్రాకులాడే వారని అర్థం. అలాటి సాధకులెందరో సిద్ధులనే క్రూర మృగాలకు బలయ్యారు. ఆయన మాత్రం తొందరపడక భద్రంగా ముందుకు సాగిపోయారు. వారు హెచ్చరించినా ఆ సాధకులు వినలేదు! ఇది పారమార్థికమైన కథ.

జన్మాంతరాలలో సాధకావస్థలో ఆయన గూడ పొరబడి, తప్పులు చేసి తర్వాత తమ తప్పు దిద్దుకున్నామని చెప్పారు : "నాతండ్రికి ధనపురాసులుండేవి. నేను వాటిలో ఒకదానిపై కూర్చొని పెద్ద పామునయ్యాను. కొంతకాలం తర్వాత ఆ ధనం విడిచిపెట్టి, తిరిగి మానవరూపం పొందాను." అంటే అంతకు ముందు జన్మలలో ఆయన సిరిసంపదలపై కోరికతో పుణ్యకార్యాలు చేసి, మరు జన్మలో శ్రీమంతుడిగా పుట్టి, వాటిమీద వ్యామోహం కల్గియున్నారు. అదే ధనపురాశిమీద కూర్చోడమంటే. అపుడా ధన వ్యామోహము, గర్వాల వలన సాటివారికెంతో హానికరంగా, పాముల్లాగా అయి కొన్ని జన్మలు హీనజన్మలెత్తారు. పరమపద సోపాన పటంలో మన బలహీనతలను పాములలాగా చిత్రించేదిందుకే. అయినా చివరకు తన తప్పు గ్రహించి, ధనాన్ని త్యజించారు. అంటే సిరిసంపదలను దానధర్మాలకు వినియోగించారు. ఇటువంటి కథలెన్నో "శ్రీసాయి ప్రబోధామృతం"లో చూడవచ్చు.

శ్రీసాయి భక్తుల గత జన్మల వృత్తాంతాలు గూడ చెప్పేవారు. తమను బాబా జన్మ జన్మలనుండి

కాపాడుతున్నారని తెలిస్తే భక్తులు కృతజ్ఞతతో ఆయనకు మరింత సన్నిహితులవుతారు గదా! శ్రీమతి ప్రధాన్‌కు బాబు జన్మించడానికి సం॥ ముందే భక్తులతో బాబా, "ఆమె 'బాబు' కు తల్లి" అనసాగారు. ఈ 'బాబు' హరి వినాయక్ సాఠే మామగారైన గణేష్ కేల్కర్ బంధువు. ఒకసారి అతనికి బాబా స్వప్న దర్శనమిచ్చి పిలవడం వలన, అతడిల్లు విడచి కాలినడకన శిరిడీచేరి బాబాను దర్శించాడు. తర్వాత యితడు కోపర్గాం మరియు యవలా గ్రామాలకు సర్వేయరయ్యాడు. ఇతని పై అధికారి లిమయే, సాఠేకు క్రింది వుద్యోగి. బాబు పూర్తిగా బాబా సేవలో వుండి తమ ఉద్యోగ ధర్మాన్ని అశ్రద్ధ చేస్తుంటే సాఠే, కేల్కర్‌లు బాబాకు ఫిర్యాదు చేశారు. బాబా, "ఆ పనులన్నీ అలా ఉంచి నా సేవ చేసుకోనివ్వండి" అని అన్నారు. అప్పటినుండి వారు బాబుకు ఎక్కువ పనులు చెప్పేవారుగాదు. సాయి ఒక్కొక్కప్పుడు మంచి మంచి ప్రసాదాలన్నీ అతనికి పెట్టేవారు. సం॥1910లో ఒకసారి ఆయన "బాబు విషయంలో జాగ్రత్త తీసుకో!" అని కేల్కర్‌ను హెచ్చరించారు. అతనికేమీ అర్థంగాలేదు. కొద్ది రోజులలో బాబుకు తీవ్రమైన జ్వరమొచ్చింది. ఒకరోజు కేల్కర్‌తో, "బాబు యింకా జీవించే వున్నాడా?" అన్నారు బాబా. కొద్దిరోజులలో బాబు శిరిడీలోనే, తన 22వ యేట చనిపోయాడు. అటు తర్వాత గూడ ఆయన తరచుగా అతనిని తలచు కుంటూండేవారు.

పై కథలో బాబా చెప్పిన 'బాబే' కేల్కర్ బంధువైన ఈ బాబు. ఇతడు మరణించిన కొద్ది కాలానికి శ్రీమతి ప్రధాన్ కడుపున మరలా జన్మించాడు. నాలుగు మాసాల ఆ బిడ్డనెత్తుకుని సాయి ఎంతో ప్రేమగా, "బాబూ! ఎక్కడికెళ్ళావు? నేనంటే విసుగుపుట్టి వెళ్ళి పోయావా" అన్నారు. ఆయనను చూస్తూనే ఆ బిడ్డ కిలకిలా నవ్వాడు.

మొదటిసారి శిరిడీ దర్శించిన నార్కేను శ్యామా పరిచయం చేయబోతే సాయి, "వీడిని నాకు పరిచయం చేయడమా? ముప్పై జన్మలనుండి వీడు నాకు తెలుసు!" అన్నారు. అలాగే తమకు రఘువీరపురందరేతో ఏడు శతాబ్దాల నుండీ సంబంధమున్నదని చెప్పి, 'నేనితనినెప్పుడూ మర్చిపోను. ఇతడు 2000 మైళ్ళ దూరానున్నా సరే, ఇతడు లేకుండా నేనొక్క మెతుకైనా తినను" అన్నారు. బాబాను మనమంతగా గుర్తుంచుకోగలమా?

ఒకప్పుడు లెండీ ప్రక్కగా పోతున్న మంద నుండి బాబా రూ. 32/-లకు రెండు మేకలు కొని తెచ్చారు. వాటి అసలు విలువ రూ. 8/-లు. సాయి మోసపోయారని శ్యామా, తాత్యాలు గోలచేసారు. సాయి 4 శేర్ల పప్పులు కొని ఆ మేకలకు పెట్టి, వాటిని తిరిగి ఆ మందల కాపరికిచ్చేసారు. తర్వాత భక్తులతో ఆయన, "ఈ మేకలు పూర్వజన్మలో నా పొరుగింటి మానవులు. మొదట వారిద్దరూ ఎంతో ప్రేమగా వుండేవారు. నన్ను గూడ యెంతగానో ప్రేమించేవారు. తర్వాత ద్వేషాలు పెంచుకొని ఒకరినొకరు చంపుకుని యిప్పుడలా పుట్టారు. నా ప్రక్కగా వెళ్తూ అవి నావంక చూచినపుడు, వాటిపై ప్రేమవల్ల కొంతసేపు నావద్ద వుంచుకొని తృప్తిగావించాను. నా బేరం మీకు నచ్చకపోవడంవల్ల వాటిని త్రిప్పి పంపేశాను" అన్నారు. అలాగే జోగ్, దాదాకేల్కర్, శ్యామా, ఖాపర్డే, దీక్షిత్‌లు తమతోపాటు తమ గురువుచెంత చిన్న వీధిలో నివసించేవారని, ఆ ప్రీతివల్లనే తాము వీరందరినీ ఈ జన్మలో తమచెంతన చేర్చుకున్నామనీ బాబా ఒకప్పుడన్నారు.

ఒకరోజు భక్తులెందరు నైవేద్యమిచ్చినా, బాబా వాటిని తాకలేదు. ఇంతలో శ్రీమతి ఖాపర్డే మశీదుచేరి నివేదనీయగానే బాబా దానిని వెంటనే రుచిచూచి, "ఈమె పూర్వమొక వైశ్యుని గోవు. నాకా గోవు సమృద్ధిగా పాలిచ్చేది. తర్వాత ఆమె ఒక తోటమాలి కూతురిగా జన్మించింది. ఆమెనొక క్షత్రియుడు పెంచాడు. ఆమె ఒక వైశ్యుని వివాహమాడింది. ఆ తర్వాత బ్రాహ్మణ కులంలో జన్మించింది. ఎన్నో జన్మల తర్వాత మళ్ళీ ఇప్పుడీమెను చూస్తున్నాను. ఆమెకు నాపైగల ప్రేమవల్ల ఆమె సమర్పించే ఆహారం నాకెంతో ప్రీతి" అన్నారు.

కళ్యాణ్ నివాసి టి. ఎ. కార్నిక్‌తో, "నిన్ను 2000 సం॥ల నుండీ యెరుగుదును. నీవెప్పుడూ పెడబుద్ధీ, కోతియుక్తులూ గలవాడవు" అన్నారు. దుష్ట సంస్కారాలు పోవడమెంత కష్టమో! యశ్వంతరావు గురించి, "వీడు పూర్వజన్మలో పవిత్రమైన నడవడి గలవాడు. అందుకే యిప్పుడీ తల్లి గర్భాన జన్మింపజేశాను. ఇప్పటికీ యితనిలో మంచి గుణాలున్నాయి" అన్నారు. ఒకసారి మశీదులో నింబారుపై నివసిస్తున్న పిచ్చుకల గురించి ఆయన, " అవి గతజన్మలో యిక్కడే గూడు కట్టుకున్నాయి, వాటినొక పాము మ్రింగింది. అవి తిరిగి మళ్ళీ యిక్కడే గూడు కట్టుకున్నాయి" అన్నారు.

సాయి ఒకప్పుడిలా చెప్పారు-- "ఒకరోజుదయం నేను అల్పాహారం చేసి కాలినడకన ఒక చిన్న నదికి వెళ్ళి స్నానంచేసి విశ్రాంతిగా కూర్చుని చిలిం సిద్ధం చేసుకుంటున్నాను. ఒక బాటసారి నమస్కరించి నా ప్రక్కన కూర్చున్నాడు. ఇంతలో ఒక కప్ప అరుపు విన్పించింది. అదేమిటని అతడడిగాడు. కప్పనొక పాము పట్టుకున్నదని, వారిద్దరూ కర్మఫలం అనుభవిస్తున్నారనీ చెప్పాను. అతడు చూచివచ్చి 10, 15 నిమిషాలలో ఆ పాము కప్పను మ్రింగివేస్తుం దన్నాడు. 'అలా జరగనివ్వను. దానినెలా రక్షిస్తానో చూడు!' అని వాటిని సమీపించి, 'ఓ వీరభద్రప్పా! నీవు పాముగాను, చెన్నబసప్ప కప్పగానూ జన్మించినా మీ ద్వేషాలు వీడలేదా? ఇప్పుడైనా విడవండి!' అన్నాను. కప్పను విడచి పాము నదిలోకి దూకింది. కప్ప పొదలలో దాక్కుంది. ఆ బాటసారి అసలు వృత్తాంతం చెప్పమంటే యిలా చెప్పాను :

"ఒకప్పుడు నేనుండే ప్రదేశానికి 5 మైళ్లలో ఒక శిధిలమైన మహాదేవుని ఆలయం వుండేది. భక్తులు ఆలయ పునరుద్ధరణ కోసం విరాళాలు ప్రోగుచేసి, స్థానికుడైన ఒక ధనికుడికి అప్పజెప్పారు. ఆ లోభి రెండుసార్లూ ఆ ధనం సొంతానికి వాడుకుని, దొంగ లెక్కలు చెప్పాడు. ఒకరోజు మహాదేవుడతని భార్యకు స్వప్న దర్శనమిచ్చి, గర్భగుడికి కప్పు వేయిస్తే ఆమె వెచ్చించిన దానికి వందరెట్లివ్వగలనన్నాడు. ఆ లోభి, ' ఆ శివుడు నాకే యెందుకు చెప్పకూడదు? ఇది కేవలం మనమధ్య స్పర్థను కల్పించడానికి వచ్చిన పీడకల' అని ఆమె మాటను త్రోసిపుచ్చాడు. అయిష్టంతో యిచ్చిన విరాళాలు భగవంతుడిష్టపడడు. భక్తితో ఎంత స్వల్పంగా యిచ్చినా తృప్తి చెందుతాడు. ఆయన తిరిగి ఆమెకు స్వప్నంలో కనపడి, 'నీ భర్త మాటలు పట్టించుకోకు; నీకిష్టమైతే నీ ధనం వెచ్చించి పని జరిపించు' అని చెప్పారు. తన పుట్టింటివారిచ్చిన నగలను అందుకై వెచ్చించదలచానని ఆమె భర్తతో చెప్పింది. ఆ కుత్సితుడు రూ. 1,000/-ల విలువగల ఆ నగలు తీసుకొని అందుకు బదులుగా ఒక పేదరాలు రూ. 200/-లకు తనకు తాకట్టు పెట్టిన ఒక ఊసరక్షేత్రాన్ని దేవుడి పేరపెట్టి, దానిని పూజారికి అప్పగించాడు. కొద్ది కాలానికి వారింటిమీద పిడుగుపడి భార్యభర్తలు మరణించారు. మరుజన్మలో ఆ లోభి మధురలో వీరభద్రప్ప అనే బ్రాహ్మణుడుగా జన్మించాడు. అతని భార్య ఆలయ పూజారి కూతురు గౌరిగాను, భూమిని తాకట్టు పెట్టిన పేదరాలు ఆలయ ధర్మకర్త కొడుకైన చెన్నబసప్పగానూ జన్మించారు. ఆ పూజారి నా భక్తుడు. యుక్త వయస్కురాలైన గౌరికి వరాన్వేషణ చేస్తున్నాడు. సమయానికి వరుడు తనకై తానే రాగలడని నేను చెప్పినట్లే వీరభద్రప్ప వచ్చాడు. అతడికి ధనాశ పోలేదు. అదృష్టవశాత్తు ఆ దేవుడి మాన్యం 1 లక్షకు, అంటే గత జన్మలో ఆమె దేముడికిచ్చిన నగలకు వందరెట్లు విలువకు అమ్మకమైంది. ఆ ధనంకోసం తగవుపడి, అందరూ నాతో సంప్రదించారు. నేను ఆ ఆస్థి దేముడిదని, వారసురాలైన గౌరి అనుమతి లేకుండా దానినేమీ చేయరాదని, ఆమె భర్తకైట్టి హక్కూ లేదనీ చెప్పాను. నేను గౌరిని మంచి చేసుకొని, ఆస్థిని చేజిక్కించుకోచూస్తున్నానని వీరభద్రప్ప నన్ను నిందించాడు. నేను భగవంతుని స్మరించి వూరుకున్నాను. గౌరి నన్ను శరణువేడితే అభయమిచ్చాను. నాటిరాత్రి మహాదేవుడామెకు స్వప్నంలో కన్పించి, 'ఆ ధనమంతా నీది; ఎవరికీ యివ్వవద్దు. అందులో కొంత చెన్నబసప్ప చెప్పినట్లు ఆలయానికి వెచ్చించు. మిగిలింది వెచ్చించాలనుకుంటే మసీదులోని బాబాతో సంప్రదించు' అని చెప్పాడు. ఆమె నన్నడి

గినప్పుడు అసలు మొత్తాన్ని ఆమెనుంచుకోమని, వడ్డీలో సగం చెన్నబసప్పకిమ్మనీ, అందులో వీరభద్రప్పకెట్టి ప్రసక్తీ లేదనీ చెప్పాను. ఇంతలో వీరభద్రప్ప చెన్నబసప్పను చంపుతానని బెదిరించాడు. అతడు భయపడి నన్ను శరణువేడాడు. కొంతకాలానికి వారిద్దరూ మరణించి, వీరభద్రప్ప పాముగాను, చెన్నబసప్ప కప్పగానూ జన్మించారు. అప్పుడు చెప్పబసప్పకిచ్చిన వాగ్దానమే నేనిప్పుడు పాలించాను. భగవంతుడు తన భక్తుడైన యితనిని కాపాడటానికే నన్నిక్కడకు పంపాడు'' ఈ వృత్తాంతం ఒక గొప్ప సూక్ష్మాన్ని తెలుపుతుంది. మానవులు చేసిన కర్మలేకాదు, భావాలుకూడ మరు జన్మలకు కారణమౌతాయి. అందుకే సాటి మనిషిని, ''పనికిమాలినవాడా!'' అని తిట్టినాగూడ నరకమొస్తుందని క్రీస్తు చెప్పాడు. సాటివారిని పరోక్షంగా నిందించడం పాపమని సాయి బోధించిన మరొక సంఘటన యింతకుముందు గమనించాము. అందుకే **మానవుడు సాత్త్విక భావాలనలవరచుకుని అసుర భావాలను తొలగించుకోడం ఆధ్యాత్మిక జీవితానికంతటికీ పునాదిగా చెప్పింది భగవద్గీత.**

★★★

**★ శనివారం పారాయణ సమాప్తము ★**

